క్లుప్తంగా

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



జెండాను ఎగురవేస్తున్న జిల్లా అసోసియేట్ అధ్యక్షురాలు గాయత్రి

నర్సీపట్నం: యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయం ఆవరణలో యూనియన్ జెండాను జిల్లా అధ్యక్షురాలు పి.గాయత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూటీఎఫ్ ప్రస్థానం చాలా సుదీర్ఘమైందన్నారు. ఉపాధ్యాయల సమస్యల పరిష్కారంలో అలుపెరగని పోరాటం సాగిస్తుందన్నారు. విద్యార్థులకు ఉపాధ్యాయులకు ఏ సమస్య వచ్చినా అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎం.చిట్టియ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాకవరపాలెంలో భారీ వర్షం



మాకవరపాలెంలో కురుస్తున్న భారీ వర్షం

మాకవరపాలెం: మండలంలో భారీ వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడింది. వారం రోజులుగా అధికంగా కాస్తున్న ఎండలతో ప్రజలు ఉక్కపోతకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం నుంచి అధిక ఎండ కాసింది. అనంతరం సాయంత్రం 4 గంటలకు ఒక్కసారిగా వాతావరణం చల్లబడి గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. సుమారు గంటపాటు కురిసిన వర్షంతో ప్రజలకు ఉపశమనం లభించింది. మెట్ట ప్రాంతాల్లో వరి నాట్లు వేసుకునేందుకు ఈ వర్షం కొంతమేర మేలు చేసిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వాలాబులో మెగా వైద్య శిబిరం నేడు

దేవరాపల్లి: సంఘ మిత్ర రూరల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఆదివారం గిరిజన పంచాయతీ వాలాబులో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక ప్రభుత్వ పాఠశాల ఆవరణలో నిర్వహించే ఈ శిబిరంలో చెవి, ముక్కు, గొంతు (ఈఎన్టీ) వైద్య నిపుణుడు బండారు రామ చంద్రరావు, తదితర వైద్యులు సేవలందిస్తారన్నారు. పంచాయతీ పరిధి గ్రామాల వారు హాజరు కావాలని కోరారు.

విత్తన శుద్ధితో తెగుళ్ల నివారణ



విత్తనశుద్ధిపై అవగాహన కల్పిస్తున్న ఏవో వాసుదేవరావు

మాడుగుల రూరల్: విత్తన శుద్ధి చేయడం ద్వారా నాట్లు వేసిన నెల రోజుల వరకూ పంటకు ఎటువంటి తెగుళ్లు సోకకుండా రక్షించుకోవచ్చునని మండల వ్యవసాయాధికారి వాసుదేవరావు తెలిపారు. ముకుందపురంలో శనివారం పోలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వరి విత్తనాలను తప్పకుండా విత్తనశుద్ధి చేయాలని రైతులకు సూచించారు. విత్తనశుద్ధి చేసుకునే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల సిబ్బంది మంగరాజు, శ్రావణి, జగ్గారావు పాల్గొన్నారు.

వరి నాట్లలో ప్రత్యేక జాగ్రత్తలు అవసరం

అనకాపల్లి: నారుమడులు నాటేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం డాక్టర్ ఏడీఆర్ సీహెచ్.ముకుందరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నారుమడుల్లో ఆకు చివరలను తుంచి 20 ఇన్‌టూ 15 సెం.మీ. దూరంలో కుదురుకు 2–3 మొక్కల చొప్పున చ.మీ.33 మొక్కల సాంద్రత ఉండేటట్టు నాటుకోవాలి. ప్రతి రెండు మీటర్లకు 20 సెం.మీ. బాటలు తియ్యడం మంచిది. నాట్లు వేసుకునేటప్పుడు ఎకరాకు 35 కిలోల యూరియా, 150 కిలోల సింగిల్ సూపర్‌ఫాస్పేట్, 17 కిలోల మురేట్ ఆఫ్ పోటాష్‌ను, ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్ వేసుకోవాలని తెలిపారు. జింక్ సల్ఫేట్ వేసినప్పుడు భాస్వరం ఎరువులతో కలపకుండా, కనీసం మూడు రోజుల వ్యవధి ఉండేలా చూసుకోవాలి.



పశువుల ఆస్పత్రి భవనం శ్లాబ్ పెచ్చులు రాలిపడుతున్న దృశ్యం



శిథిలావస్థకు చేరిన దేవరాపల్లి పశు వైద్యశాల

కూలేందుకు సిద్ధంగా..

అసలే వర్షాకాలం.. ఈ సమయంలో సీజనల్ వ్యాధుల బారిన పడుతున్న పశువులకు మెరుగైన వైద్య సేవలందిస్తూనే.. మరో వైపు భయంభయంగా సిబ్బంది విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. వీరు తల దాచుకుంటున్న దేవరాపల్లి పశువుల ఆస్పత్రి భవనం కూలేందుకు సిద్ధంగా ఉంది. చిన్నపాటి వర్షం కురిస్తే చాలు శ్లాబ్ పెచ్చులూడి మీద పడుతున్నాయని బెంబేలెత్తిపోతున్నారు.

- శిథిలావస్థలో దేవరాపల్లి పశు వైద్యశాల
- ఆస్పత్రి భవనం గోడలకు బీటలు
- పెచ్చులూడుతున్న శ్లాబ్
- తలుపులు, కిటికీలు ధ్వంసం

దేవరాపల్లి: స్థానిక పశువుల ఆస్పత్రి భవనం ప్రమాద భరితంగా దర్శనమిస్తోంది. ఈ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని కూలేందుకు సిద్ధంగా ఉంది. ఆస్పత్రి ముందు భాగంలో పోర్టుకో శ్లాబ్ కిందకు కుంగి వేలాడి ఉంది. దీంతో ఇక్కడ విధులు నిర్వర్తించే సిబ్బంది ఎప్పుడు కూలిపోతుందోనని భయాందోళనకు గురవుతున్నారు. భవనం గోడలు బీటలు వారడంతో పాటు శ్లాబ్ పెచ్చులూడి రాలడంతో భయం భయంగా విధులు నిర్వర్తిస్తున్నారు.



బీటలు వారిన పశువుల ఆస్పత్రి భవనం గోడలు

భవనం వెనుక భాగంలో తలుపు, కిటికీలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. దీంతో భవనంలో విలువైన వస్తువులు, మందులు ఇతరాత్ర సామగ్రి ఉంచే పరిస్థితి లేదు. వర్షం వస్తే భవనం పూర్తి కారిపోయి చిత్తడిగా మారుతోంది. భారీ వర్షాలు, తుపాన్ల సమయంలో ఈ భవనంలో విధులు నిర్వర్తించాలంటే పశు వైద్య సిబ్బంది హడలిపోతున్నారు.

హడలిపోతున్న పాడి రైతులు

ఇక్కడి పశు వైద్యశాలలో వైద్య సేవల కోసం వచ్చే పాడి రైతులు సైతం ఆస్పత్రి దుస్థితిని చూసి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పూర్తిగా శిథిలమైన భవనం ఎప్పుడు కూలిపోతుందోనని భయంతో వారు లోపలికి వచ్చేందుకు ధైర్యం చేయడం లేదు. బయట నుంచి పాడి పశువులను సిబ్బందికి చూపించి అక్కడి నుంచి వెళ్లి పోతున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఇట్టే అర్థమవుతోంది. ఎం. అలమండ పశు వైద్యశాల ఫ్లోరింగ్ కిందకు దిగిపోవడంతోపాటు మరుగుదొడ్డి సదుపాయం లేక అక్కడ విధులు నిర్వహించే సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మహిళా సిబ్బంది అవస్థలు వర్ణనాతీతం. మామిడిపల్లి పశువైద్య శాలలో భవనం బాగానే ఉన్నప్పటికీ శ్లాబ్ నుంచి నీరు కారిపోవడంతో వర్షం వస్తే సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దేవరాపల్లి మండల పరిధిలో 15 వేల ఆవులు, గేదెలు, 15 వేల గొర్రెలు, మేకలు, 60 వేల పౌల్ట్రీ కోళ్లు ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పశువైద్య శాలలకు నూతన భవనాలు నిర్మించడంతోపాటు ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని మండల పాడి రైతులు డిమాండ్ చేస్తున్నారు.



ధ్వంసమైన పశువుల ఆస్పత్రి తలుపులు, కిటికీలు

పశువైద్య సిబ్బంది అవస్థలు



దేవరాపల్లి పశువుల ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో విధులు నిర్వహించడం ఇబ్బందిగా ఉంది. శ్లాబ్ పెచ్చులూడి రాలిపడుతుండటంతో సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. – కె.మంజూష, ఇన్‌చార్జి పశువైద్యాధికారి, దేవరాపల్లి

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడొద్దు



మెడికల్ క్యాంపును పరిశీలిస్తున్న జడ్జి సూర్యకళ



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు, ప్రసాద్ పాత్రుడు, లీలాప్రసాద్

చీడికాడ: ప్రతి ఒక్కరూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని చోడవరం మేజిస్ట్రేట్ బి.సూర్యకళ తెలిపారు. జ్యుడిషియరీ, చీడికాడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కోనాంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. 70 మంది రోగులను చీడికాడ పీహెచ్‌సీ వైద్యులు సునీల్‌కుమార్, శ్రీనివాసరావు పరీక్షించారు. మందులు అందజేశారు. అనంతరం కార్యక్రమంలో చోడవరం మేజిస్ట్రేట్ సూర్యకళ మాట్లాడుతూ చిన్నచిన్న తగాదాలను లోక్ అదాలత్‌లో తెల్చుకోవాలని సూచించారు. ఎస్సై నారాయణరావు పాల్గొన్నారు.

సారా నిర్మూలనపై అవగాహన

మాడుగుల: మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో శనివారం ఎం.గదబూరులో సారా నిర్మూలనపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది శ్రీనాథు ప్రసాద్‌రావు మాట్లాడారు. గంజాయి, సారా విక్రయాలు మంచిది కాదని, వీటి ద్వారా పట్టుబడితే ఏడేళ్ల నుంచి జీవితకాలం వరకు శిక్ష పడే అవకాశం ఉంటుందన్నారు. ప్రజలు ఈ రెండింటికి దూరంగా ఉండాలని, ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకోవాలని సూచించారు. అనంతరం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 50 మంది రోగులను వైద్యాధికారులు ప్రసాద్, పాత్రుడు, లీలా ప్రసాద్ పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. న్యాయవాదులు ఎల్లారావు, ప్రమోద్, కృష్ణ, ఎస్ఐ దామోదరనాయుడు, కోర్టు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

13న వినియోగదారుల పరిష్కార వేదిక

గొలుగొండ: నర్సీపట్నం రూరల్ పరిధి గొలుగొండ, కోటవురట్ల, నాతవరం మండలాల్లోని విద్యుత్ వినియోగదారుల సమస్యలపై పరిష్కార వేదిక కార్యక్రమం నర్సీపట్నంలో ఈ నెల 13న నిర్వహించనున్నట్లు గొలుగొండ ఏఈఈ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఆ రోజు వినియోగదారులు తమ సమస్యలపై ఫిర్యాదు చేసుకోవాలన్నారు. దీనికి జిల్లా అధికారులు హాజరవుతున్నట్లు తెలిపారు.

సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తం



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి ప్రసన్న

నాతవరం: సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి ప్రసన్న అన్నారు. శనివారం నాతవరం పీహెచ్‌సీ పరిధిలో జిల్లేడుపూడి పంచాయతీ శివారు రైతువెంకయ్యపాలెంలోనూ గునుపూడి పీహెచ్‌సీ పరిధిలో వై.బి.అగ్రహారంలోనూ వైద్య శిబిరాలు నిర్వహించారు. రోగులను వైద్యులు పరీక్షించి మందులు పంపిణీ చేశారు. సీజనల్‌గా వచ్చే వ్యాధులు పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ప్రసన్న మాట్లాడుతూ కలుషిత నీరు తాగడం వల్ల జ్వరాలు వస్తున్నాయన్నారు. ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. టైర్లు, తాగునీటి కుళాయిలు, డ్రమ్ములతో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గునుపూడి పీహెచ్‌సీ వైద్యాధికారులు చంద్రశేఖర్‌బలిజి, సిహెచ్ అనూష, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హాస్టళ్ల విద్యార్థులకు వైద్య పరీక్షలు



బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యాధికారి ధనలక్ష్మి



కేజీబీవీలో విద్యార్థినులతో కలిసి ప్లేటులో ఆహారం పట్టుకుంటున్న వైద్యాధికారి ధనలక్ష్మి

రోలుగుంట: స్థానిక బీసీ బాలుర వసతి గృహం, కేజీబీవీలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. 110 మంది విద్యార్థులకు, 240 మంది విద్యార్థినులకు వైద్యాధికారి కె.ధనలక్ష్మి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పలు సూచనలు, సలహాలు అందించారు. వేడి ఆహారంతోపాటు, కాచిన వేన్నీళ్లు తాగాలన్నారు. ప్రధానంగా వసతి గృహ ఆవరణలో చెత్తాచెదారం లేకుండా శుభ్రపరచాలన్నారు. విశ్రాంతి సమయంలో దోమతెరలు వాడాలన్నారు. అనంతరం కేజీబీవీలో వంటల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థినులకు తాగేందుకు కాచి చల్లార్చిన నీరు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో కృష్ణ, హెల్త్ అసిస్టెంటు కన్నబాబు, ఏఎన్ఎం పాల్గొన్నారు.

విద్యుత్ ఏడీఈగా వెంకట్రావు

యలమంచిలి రూరల్: విద్యుత్ శాఖ యలమంచిలి ఏడీఈగా కె.వెంకట్రావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఏపీఈపీడీసీఎల్ విశాఖపట్నం క్వాలిటీ కంట్రోల్ విభాగంలో అసిస్టెంట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న వెంకట్రావు పదోన్నతిపై యలమంచిలి ఏడీఈగా నియమితులయ్యారు. వెంకట్రావు గతంలో యలమంచిలి ఏఈఈగా పనిచేశారు. విద్యుత్ వినియోగదారుల సమస్యలు త్వరితగతిన పరిష్కరించడం, నాణ్యమైన విద్యుత్‌ను అందించడానికి కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

వర్గీకరణపై దళిత సంఘాల ఆందోళన



కొత్తకోటలో మానవహారం చేస్తున్న దళిత సంఘాలు

చోడవరం: ఎస్సీ వర్గీకరణ చేయడం వల్ల దిగువ స్థాయి ఎస్సీ కులాలన్నీ రిజర్వేషన్ల పొందడంలో తీవ్రంగా నష్టపోతామంటూ పలు ఎస్సీకుల సంఘాలు ఆందోళనకు దిగాయి. రావికమతం మండలం కొత్తకోటలో శనివారం నిరసన ర్యాలీ, అనంతరం బీఎన్‌రోడ్డుపై జంక్షన్ వద్ద మానవహారం చేశాయి. ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునపరిశీలన చేయాలని దళిత సంఘాల ప్రతినిధులు మల్లేటి రాజు, బుంగ బుల్లిబాబు, అప్పారావు, పూడి దేవా, నాగేశ్వరరావు, గంగరాజు డిమాండ్ చేశారు. ఎస్సీల్లో మాలలతోపాటు 16 ఉప కులాలు వర్గీకరణ చేస్తే తీవ్రంగా నష్టపోతారన్నారు. రాజ్యాంగ సవరణతోపాటు ఆర్టికల్ 341లో అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. వర్గీకరణ అంశం ముగిసే వరకూ తమ ఆందోళన కొనసాగిస్తామన్నారు. దళిత సంఘాల నాయకులు పూడి అర్జున్, మరువాడ అర్జునరావు, టి. శేఖర్‌అప్పారావు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బారిన అధికంగా మహిళలు

కశింకోట: ప్రాణాంతకమైన క్యాన్సర్ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని మహాత్మాగాంధీ క్యాన్సర్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ వైద్య నిపుణురాలు కావ్యలక్ష్మి కోరారు. కశింకోటలోని సెయింట్ జాన్స్ స్కూలులో శనివారం క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో మహిళలకు క్యాన్సర్‌పై అవగాహన, స్క్రీనింగ్ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు ఎక్కువగా క్యాన్సర్ బారిన పడుతున్నారని, సర్వైకల్ క్యాన్సర్, రొమ్ము కాన్సర్, తదితర క్యాన్సర్ లక్షణాలతో మృతి చెందుతున్నారన్నారు. క్యాన్సర్ బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని, క్యాన్సర్ లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలన్నారు.

అంగన్‌వాడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

అనకాపల్లి : సార్వత్రిక ఎన్నికలో ముందు కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరిస్తామని చెప్పిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మజ్జి నాగేషు అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో అంగన్వాడీ 42 రోజుల సమ్మె కాలంలో చేసిన పుస్తకాన్ని శనివారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్మికుల కనీస వేతనం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత, గ్రాట్యూటీ, సమ్మెకాలంలో చేసిన కార్మికులకు జీతాలు చెల్లించాలని ఆమె కోరారు. సమ్మెకాలలో పోరాటానికి మద్ద తు పలికిన టీడీపీ ప్రభుత్వం ప్రస్తుతం అధికారంలో ఉన్నాదని, గ్రాట్యూటీ అమలుకు కృషి చేస్తామనని నారా లోకేష్ సమ్మె శిబిరంలో ప్రకటించారని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో మంత్రిగా నారా లోకేష్ ఉన్నందున సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షురాలు ఎం.దుర్గారాణి, జిల్లా నాయకులు కాసులమ్మ, వి.వి.రమణమ్మ, జయలక్ష్మి, తనూజ, అంజలి, భ్రమరాంబ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్సను గెలిపిద్దాం

మాజీ విప్ కరణం ధర్మశ్రీ



ఎంపీటీసీల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ విప్ కరణం ధర్మశ్రీ

రోలుగుంట: త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స సత్యనారాయణను గెలిపిద్దామని మాజీ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. రోలుగుంటలోని జెడ్పీటీసీ పోతల లక్ష్మీరమణమ్మ నివాసంలో మండల స్థాయిలో పార్టీ ఎంపీటీసీలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ధర్మశ్రీ హాజరై సెగ్మెంట్ల వారీగా ఎంపీటీసీలతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. దీనిపై ఎంపీటీసీలందరూ పార్టీ బలపరచిన అభ్యర్థికే తమ మద్దతు అని స్పష్టం చేశారు. పార్టీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాలే తమకు శిరోధార్యమన్నారు. అనంతరం ధర్మశ్రీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్ని ప్రలోభాలు పెట్టినా 350 ఓట్ల పైబడిన మెజార్టీతో బొత్స గెలుస్తారన్నారు. జెడ్పీటీసీ పోతల లక్ష్మీరమణమ్మ, ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ దోసపత్ని వరలక్ష్మి, ఎంపీటీసీలు వద్దాది సతీష్, నాయకులు పోతల లక్ష్మీశ్రీనివాస్, కర్రి రాము, తమటపు సత్యంనాయుడు, ఉలబాల రాము, లగుడు కృష్ణంనాయుడు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పంద్రాగస్టు పోటీలు



వడ్డాదిలో హోరాహోరీగా వాలీబాల్ పోటీలు



వడ్డాదిలో ఖోఖో ఆడుతున్న కాలేజీ విద్యార్థులు

బుచ్చెయ్యపేట: మేజర్ పంచాయతీ వడ్డాది ప్రభుత్వ జూనియర్ కాలేజీలో హోరాహోరీగా ఆటల పోటీలు సాగుతున్నాయి. పంద్రాగస్టు సందర్భంగా శనివారం కాలేజీ యాజమాన్యం విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, షటిల్, రన్నింగ్, వ్యాసరచన తదితర పోటీలు నిర్వహిస్తోంది. ఈ పోటీల్లో విద్యార్థిని, విద్యార్థులు హుషారుగా పాల్గొని తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. క్రీడల పట్ల ఆసక్తి ఉన్న వారందరికీ ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు స్వాతంత్ర్య దినోత్సవం రోజున బహుమతులు అందిస్తామని ప్రిన్సిపాల్ అన్నపూర్ణ తెలిపారు. అధ్యాపకులు నరసింహమూర్తి, సుధీర్, శ్రీనివాస్ తదితరులు విద్యార్థుల మధ్యన స్నేహ సంబంధాలు ఉండేలా ఆటల పోటీలు నిర్వహించారు.

దోమకాటుతోనే డెంగ్యూ



ఎ.భీమవరంలో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి తరణి

కె.కోటపాడు: ప్రస్తుత వర్షాకాలంలో దోమకాటుతో ప్రజలు డెంగ్యూ, మలేరియా బారిన పడే అవకాశముందని వైద్యాధికారి తరణి తెలిపారు. డెంగ్యూ బారినపడకుండా ఉండేందుకు ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలపై ఎ.భీమవరంలో శనివారం ఆమె వివరించారు. ఇంటి పరిసరాల్లో రోజుల కొద్దీ మురుగు ఉండకుండా చూసుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీరు తాగాలని, వేడి ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు, హెచ్.వి.అచ్చియ్యమ్మ, ఎ.ఎన్.ఎం.దేవి, ఎం.ఎల్.హెచ్.పి. హేమ పాల్గొన్నారు.

అంబేడ్కర్ ట్రస్ట్ సేవలు అభినందనీయం



దుస్తులు, పుస్తకాలు పంపిణీ చేస్తున్న చోడవరం అంబేడ్కర్ ట్రస్ట్ ప్రతినిధులు

చోడవరం: అనాథలకు సాయం చేయాలన్న ఉద్దేశంతో సేవా కార్యక్రమాలు చేసేందుకు చోడవరం అంబేడ్కర్ ట్రస్ట్ ముందుకు రావడం అభినందనీయమని విశాఖపట్నం అంబేడ్కర్ భవన్ చైర్మన్ బొడ్డు కల్యాణరామ్ అన్నారు. చోడవరం అంబేడ్కర్ ట్రస్ట్ చైర్మన్, రిటైర్డ్ జడ్జి నడుపూరు సన్యాసిరావు ఆధ్వర్యంలో స్థానిక ప్రేమ సమాజంలో అనాథ వృద్ధులకు దుస్తులు, విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. అనాథలకు సేవ చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కల్యాణరామ్ అన్నారు. ట్రస్ట్ ప్రతినిధులు కండెల్లి వెంకటరావు, ప్రేమసమాజం మేనేజర్ ప్రసాద్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ న్యాయ మహాశిల్పంపై దాడి గర్హనీయం

మాడుగులలో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన



మాడుగులలో కొవ్వొత్తులతో వైఎస్సార్ సీపీ నాయకులు, దళిత సంఘ సభ్యులు నిరసన

మాడుగుల: నవభారత నిర్మాత, బడుగు బలహీన వర్గాల ఆశా జ్యోతి డాక్టరు బీఆర్ అంబేడ్కర్ న్యాయ మహాశిల్పంపై దాడిని ఖండిస్తూ శనివారం రాత్రి పాత బస్టాండ్‌లో బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, కె. కోటపాడు జెడ్పీటీసీ ఈర్లె అనురాధ ఆదేశాలతో సర్పంచ్ ఎడ్ల కళావతి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు, దళిత సంఘ సభ్యులు నిరసన తెలిపారు. అధికార పార్టీకి చెందిన కొంతమంది అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం చేయడానికి వీలుకాక మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేరున్న శిలాఫలకం ధ్వంసం చేసి నీచబుద్ధి చాటుకున్నారని విమర్శించారు. ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, మాజీ ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనువాస్, పార్టీ నాయకులు సుందర రాజు, కోట్యాడ భాస్కరరావు, పట్టణాధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనువాసరావు, కుక్కర శ్రీధర్, పుట్టా మురళి, రాఖి శ్రీను, శ్రీనాథు జగ్గారావు, దళిత సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



ఏఎల్‌పురంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేస్తున్న యూత్ సభ్యులు

అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం..

గొలుగొండ: విజయవాడలో డాక్టరు బీఆర్ అంబేడ్కర్ న్యాయ మహాశిల్పంపై దాడిని ఖండిస్తూ శనివారం అంబేడ్కర్ యూత్ సభ్యులు ఏఎల్‌పురంలో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వంలో దళిత వర్గాలకు రక్షణ లేదని నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షురాలు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి భారత రాజ్యాంగ నిర్మాత, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్ విగ్రహాన్ని విజయవాడ నడిబొడ్డున ఏర్పాటు చేయించారన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో కొంతమంది వ్యక్తులు దాడి చేయడం దారుణమన్నారు.